క్లుప్తంగా

సూక్ష్మ పోషకాలపై అవగాహన ఉండాలి

రెంటచింతల: పంటలను సాగు చేసేముందు తప్పనిసరిగా భూసార పరీక్షలు చేయించుకొని సూక్ష్మ పోషకాలపై రైతులు అవగాహన కలిగి ఉండటం ఎంతో ప్రయోజనమని మండల వ్యవసాయాధికారి బోయపాటి బ్రహ్మారెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక రైతు సహకార కేంద్రంలో రైతులకు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సూక్ష్మ పోషకాల లోపాలు ఉన్నట్లయితే పంటల దిగుబడి పూర్తిగా తగ్గిపోతుందని హెచ్చరించారు. ఇనుము, మాంగనీసు, బోరాన్, కాపర్, జింక్, మెగ్నీషియం, క్లోరిన్, గంధకం వంటి సూక్ష్మపోషకాలు భూమిలో సమపాలలో ఉండేలా చూసుకోవడానికి ఈ భూసార పరీక్షలు తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు. ఈ సమావేశంలో వీఏఏలు గొంటు కృష్ణారెడ్డి, పవన్ కిశోర్ పాల్గొన్నారు.

ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభం



రెంటచింతల: స్థానిక సుబ్బన్నతోట కాలనీలో వేంచేసిన అలివేలు మంగ పద్మావతి సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం 21వ వార్షికోత్సవ వేడుకలు సోమవారం నుంచి ప్రారంభమైనట్లు దేవస్థానం అధ్యక్షుడు నాళం పెద్ద బాబు, ప్రధాన అర్చకులు ఓరుగంటి మారుతి శర్మ తెలిపారు.మంగళవారం స్వామివారి శాంతి కల్యాణం మహోత్సవాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు భక్తులకు అన్నదానం చేస్తామని దేవస్థానం పాలక వర్గం సభ్యులు తెలిపారు.

బాల నాగేంద్రస్వామిని దర్శించుకున్న చింతలపూడి

పిడుగురాళ్ల: మండలంలోని జానపాడు గ్రామంలో ఉన్న హరిహర బాల నాగేంద్ర స్వామిని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్యుల విభాగం అధికార ప్రతినిధి, గురజాల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ చింతలపూడి అశోక్‌కుమార్ సోమవారం దర్శించుకున్నారు. స్వామివారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. గురజాల నియోజకవర్గంలోని ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని ఆ భగవంతుడిని కోరుకున్నట్లు ఆయన తెలియజేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

కారు ఢీకొని వ్యక్తి మృతి

పిడుగురాళ్ల: కారు ఢీకొని సున్నపు బట్టీలో పని చేసే కార్మికుడు మృతి చెందిన ఘటన పట్టణంలో సోమవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ మోహన్ తెలిపిన వివరాల ప్రకారం... వినుకొండ గ్రామానికి చెందిన యడ్లూరి లాజర్(55) కొంత కాలంగా పట్టణంలో నివాసం ఉంటున్నాడు. తెల్లవారుజామున సున్నపు బట్టీలకు నడుచుకుంటూ వెళ్తుండగా ఖలీల్ దాబా సమీపంలో కారు ఎదురుగా వచ్చి ఢీకొనటంతో తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం నర్సరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి కుమార్తె పులికూరి బాజి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

అయోడిన్ వాడకంలో జాగ్రత్తలు అవసరం



బెల్లంకొండ: శరీరంలో అయోడిన్ సమతుల్యతను కాపాడుకోవాలని చంద్రాజుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డా. నజీర్ తెలిపారు. సోమవారం మండలంలోని పాపాయపాలెం గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు అయోడిన్ లోపం వలన వచ్చే సమస్యలకు పరీక్షలను నిర్వహించారు. 90 మంది విద్యార్థులను పరీక్షించగా వారిలో 9 మందికి అయోడిన్ లోపం ఉన్నట్లు గుర్తించామని తెలిపారు. హెల్త్ సూపర్‌వైజర్ బాషా, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

స్థల ఆక్రమణదారులను అడ్డుకోవాలి

ముప్పాళ్ళ: మండలంలోని చాగంటివారిపాలెం గ్రామంలో రజక కమ్యూనిటీ కోసం కేటాయించిన స్థలాన్ని ఆక్రమించిన వారిపై చర్యలు తీసుకొని, అక్రమ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్‌ను రజక సంఘాల సభ్యులు సోమవారం వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో తొరటి అమరలింగేశ్వరరావు, తొరటి సాంబయ్య, నీలం నాగేశ్వరరావు, నీలం చినరాములు తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీల్లో సత్తా చాటాలి

సత్తెనపల్లి: క్రికెట్ పోటీల్లో సత్తెనపల్లి బార్ అసోసియేషన్ సభ్యులు సత్తా చాటాలని పలువురు న్యాయవాదులు ఆకాంక్షించారు. గుంటూరు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం నుంచి పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో పోటీలు జరుగుతున్నాయి. సత్తెనపల్లి బార్ అసోసియేషన్ టీమ్ సభ్యులను పలువురు న్యాయవాదులు అభినందించారు.

ప్లాస్టిక్ భూతం

- లైమ్ సిటీలో పెరుగుతున్న పాలిథిన్ కవర్ల వినియోగం
- తూతూమంత్రంగా మున్సిపల్ అధికారుల దాడులు
- విక్రయాలకు పడని అడ్డుకట్ట

పిడుగురాళ్ల: ప్లాస్టిక్ భూతం లైమ్ సిటీ పిడుగురాళ్ల పట్టణాన్ని పట్టి పీడిస్తోంది. అధికారులు దాడులు చేస్తున్నా.. దుకాణదారుల ప్లాస్టిక్ కవర్ల విక్రయాలను నియంత్రించలేకపోతున్నారు. నిత్యం ఇళ్లు, కార్యాలయాల్లో వాడే ప్లాస్టిక్ కవర్లను కాలువల్లో పడేయడంతో నీటి కాలుష్యమవుతోంది. పడేసిన ప్లాస్టిక్ కవర్లను జంతువులు తిని, జీర్ణం చేసుకోలేక చనిపోతున్నాయి. కాడ్మియం, సీసం వంటి విషపూరితమైన ధాతువులు, ప్లాస్టిక్ సంచుల తయారీలో ఉపయోగించనప్పుడు కూడా స్రవించి ఆహారం పదార్థాలను కలుషితం చేస్తున్నాయి. ప్లాసిక్ కవర్లకు బదులు ప్రత్యామ్నాయాన్ని వినియోగదారులు చూసుకోవాలి. పేపర్, జూట్, గుడ్డ సంచులను వినియోగించాలి. 75 మైక్రాన్ల కన్నా ఎక్కువ మైక్రాన్ల ఉన్న కవర్లను మాత్రమే వాడేలా అధికారులు కూడా చర్యలు తీసుకోవాలి.



పట్టుబడిన ప్లాస్టిక్ కవర్లతో కమిషనర్ పర్వతనేని శ్రీధర్

తూతూ మంత్రంగా దాడులు

గతంలో కూడా ఎంతో మంది అధికారులు ప్లాస్టిక్ నిషేధానికి తీసుకుంటున్న చర్యలు ఫలితాలను ఇవ్వడం లేదు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య కార్మికులకు రెండు చెత్త బుట్టల్లో అందించినప్పటికి కవర్లను వినియోగిస్తూనే వస్తున్నారు. వ్యాపారులు మాత్రం దొంగచాటుగా ప్లాస్టిక్ కవర్లను వినియోగించటం, లేదా అమ్మకాలు నిర్వహించడం చేస్తూనే ఉన్నారు. అధికారులు ఏదో ఒక సమయంలో దాడులు నిర్వహించడం మినహా..ఇతర సమయాల్లో దాడులు నిర్వహించకుండా ఉండటంతో వ్యాపారుల్లో మాత్రం మార్పు కనిపించడం లేదు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



ప్లాస్టిక్ నిషేధంపై వ్యాపారులకు కూడా అవగాహన కల్పిస్తున్నాం. ఎవరైనా అమ్మకాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. అంతేకాకుండా చిరు వ్యాపారులు, కూరగాయాలు, తోపుడు బండ్లపైన ఎవరైనా ప్లాస్టిక్ సంచులను వాడితే వారికి కూడా జరిమానాలు విధిస్తున్నాం.

– పర్వతనేని శ్రీధర్, మున్సిపల్ కమిషనర్, పిడుగురాళ్ల

ప్లాస్టిక్ విక్రయాలపై దాడులు

పిడుగురాళ్ల: ప్లాస్టిక్ కవర్లను వాడితే సహించేది లేదని మున్సిపల్ కమిషనర్ పర్వతనేని శ్రీధర్ హెచ్చరించారు. పట్టణంలోని పలు రెస్టారెంట్లు, హోటళ్లల్లో ప్లాస్టిక్ కవర్లను సోమవారం సాయంత్రం మున్సిపల్ సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ శ్రీధర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వినియోగించకుండా ఉండేందుకు ప్రజలు కూడా పూర్తిగా అధికారులకు సహకరించాలని కోరారు. ఇప్పటికే అన్ని వ్యాపార సముదాయల వారికి ప్లాస్టిక్‌ను వాడకూడదని తెలియజేయడం జరిగిందన్నారు. సిబ్బంది పాల్గొన్నారు.

పట్టణంలో తాగనీటి ఎద్దడి

మాచర్ల రూరల్: వేసవి రాకముందే పట్టణంలో మంచినీటి సమస్య తలెత్తుతోందని మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని సీపీఎం ఏరియా కార్యదర్శి బండ్ల మహేష్ డిమాండ్ చేశారు. సోమవారం ప్రజా చైతన్య యాత్రలో భాగంగా పట్టణంలో వారు పర్యటిస్తూ మాట్లాడారు. 10, 11 వార్డులలో మంచినీరు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రెండు రోజులకొకసారి మున్సిపల్ వాటర్ వస్తోందని చెప్పారు. అది కూడా సమయపాలన లేకుండా రావడంతోన పనుల కోసం వెళ్లిన వారు..నీరు పట్టుకోలేక తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారని చెప్పారు. వెంటనే మంచి నీటి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. సైడు కాల్వలలో నీరు పారుదల లేక అనారోగ్యంతో అల్లాడుతున్నారని, చాలా మందికి సబ్సిడీ గ్యాస్ నగదు అకౌంట్‌లో పడటం



సీపీఎం నాయకులకు సమస్యను వివరిస్తున్న మహిళలు

లేదని తెలిపారు. విద్యుత్ బిల్లులు అధికంగా వస్తున్నాయని ఫిర్యాదులు వచ్చాయన్నారు. మున్సిపల్ పాలనాధికారులు ఇంటి పన్నులు భారీగా పెంచి రాబడి చూసుకుంటున్నారే తప్ప సౌకర్యాలు కల్పించటంలో శ్రద్ధ చూపటం లేదని వారు విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు వై సురేష్, ఎం శోభన్‌కుమార్, కె వెంకటరత్నం, వేముల వెంకటరావులు ఉన్నారు.

చదరంగంతో జ్ఞాపకశక్తి

మాచర్ల రూరల్: చదరంగం క్రీడకు ఎంతో ప్రాముఖ్యత ఉందని, ఈ ఆటతో ఏకాగ్రత, క్రమశిక్షణతో పాటు జ్ఞాపక శక్తి పెరుగుతుందని మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. సోమవారం స్థానిక కోదండరామాలయంలో పల్నాడు చెస్ అకాడమి, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ నేతృత్వంలో నిర్వహించిన చెస్ పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. పల్నాటి ప్రాంతంలో చిన్నారులకు చెస్ క్రీడను నేర్పిస్తూ రాష్ట్ర, జాతీయ స్థాయిలో పల్నాడుకు పేరు ప్రఖ్యాతలు తీసుకొస్తున్న చెస్ కోచ్ కె.కిరణ్ కృషి అమూల్యమన్నారు. క్రమం తప్పకుండా ప్రతి మూడు నెలలకోసారి జిల్లా స్థాయిలో క్రీడా పోటీలను ఏర్పాటు చేస్తూ వారిలోని ప్రతిభను వెలికితీసేందుకు దోహదపడుతున్న కిరణ్, వాసవి క్లబ్ మాచర్ల చెన్నకేశవ నిర్వాహకుల కృషి అభినందనీయమని మున్సిపల్ చైర్మన్ పోలూరి నరసింహారావు



విద్యార్థికి బహుమతి ప్రదానం చేస్తున్న చైర్మన్ నరసింహారావు, మల్లికార్జునరావు

అన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ జోన్ చైర్మన్ ఓరుగంటి చెన్నకేశవరావు, అధ్యక్ష, ట్రెజరీ భవనాశి రవితేజ, బచ్చు రాజ్ కుమార్, వ్యవస్థాపకులు తిరివీధి వెంకట నాగేశ్వరరావు, జిల్లా సభ్యులు మేడం నాగేశ్వరరావు, పందిరి నరసింహారావు తదితరులున్నారు.

ప్రారంభమైన పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు



మన్నెం పుల్లారెడ్డి జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రంలో విద్యార్థులు

పిడుగురాళ్ల: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండల విద్యాశాఖాధికారులు విద్యార్థుల హాజరును వెల్లడించారు. సోమవారం తెలుగు పరీక్షకు పలువురు విద్యార్థుల గైర్హాజరు కనిపించింది. ఎంఈవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ పరీక్షల కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోలేదని వెల్లడించారు.

మాచవరం: మండలంలో జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు మొదటి రోజు 11 మంది విద్యార్థులు గైర్హాజరు అయినట్లు ఎంఈఓ డి.శ్రీధర్ తెలిపారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 244 మందికి గానూ 234, జీకే పబ్లిక్ స్కూల్ నందు 231 గానూ 230 మంది హాజరైనట్లు వివరించారు.

విజయపురిసౌత్: పదో తరగతి పరీక్షలు విజయపురి సౌత్‌లోని రెండు పరీక్ష కేంద్రాల్లో సోమవారం ప్రశాంతంగా మొదలయ్యాయి. ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 113 మంది విద్యార్థులకు గాను 112 మంది, పీటీజీ బాలుర పాఠశాలలో 162 మందికి గాను 161 మంది విద్యార్థులు తెలుగు పరీక్షకు హాజరయ్యారు. మాచర్ల మండలంలోని ఎత్తిపోతల గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలలో 223 మందికి గాను 222 మంది హాజరయ్యారు.

వెల్దుర్తి: మండల కేంద్రమైన వెల్దుర్తి, శిరిగిరిపాడు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో సోమవారం 10వ తరగతి పరీక్షలకు 349 మంది విద్యార్థులకు గాను 340 మంది హాజరైనట్లు ఎంఈఓ శ్రీనివాస రెడ్డి తెలిపారు.

మాచర్ల రూరల్: మండలంలో ప్రశాంతంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. 8 పరీక్ష కేంద్రాలకు 1679 మంది విద్యార్థులకు గాను, 16 మంది గైర్హాజరనైట్లు ఎంఈఓ అల్లి సురేష్ తెలిపారు.

ఏడుగురు గైర్హాజరు

గురజాల: పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. మండలంలోని గుడ్ న్యూస్ స్కూల్, పల్లెగుంత ఆదర్శ పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల, శివాణీ ఎడ్యుకేషనల్ స్కూల్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటుచేశారు. 720 మంది విద్యార్థులకు గాను 713 మంది పరీక్షలకు హాజరయ్యారని అధికారులు వెల్లడించారు.

రెంటచింతల: మండల కేంద్రంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో సోమవారం నిర్వహించిన 10 వ తరగతి పబ్లిక్ తెలుగు పరీక్షకు 800 విద్యార్థులు హాజరైనట్లు ఎంఈఓ–2 వై.శివనాగేశ్వరావు తెలిపారు. సెయింట్ జోసఫ్స్, వైఆర్ఎస్, సెయింట్‌ఆన్స్, ఫాతిమా విద్యానికేతన్ ఉన్నత పాఠశాలల్లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆరుగు విద్యార్థులు గైర్హాజరైటట్లు తెలిపారు.

ధరల పట్టిక ఏర్పాటు చేయాలి



ముప్పాళ్ళ: రేషన్‌దుకాణాల్లో ధరల పట్టికతో పాటుగా స్టాక్ వివరాలు తెలిపే బోర్డులు ఏర్పాటు చేయాలని తహసీల్దార్ ఎం.భవానిశంకర్ చెప్పారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రేషన్‌దుకాణాల నిర్వాహకులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ప్రతి దుకాణదారుడు తప్పనిసరిగా సమయపాలన పాటించాలని ఆదేశించారు. డిప్యూటీ తహసీల్దార్ సీహెచ్ లక్ష్మీప్రసాద్, ఆర్.ఐ ఆంజనేయులు, ఆయా గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం



సత్తెనపల్లి: పట్టణంలోని గుంటూరు రోడ్డులో గల ఆదరణ అనాథ వృద్ధుల ఆశ్రమంలో హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా వెల్లలూరు గ్రామానికి చెందిన అంబటి వెంకట సుబ్బారావు వర్ధంతి సందర్భంగా వారి కుమార్తె – అల్లుడు సౌజన్య – నాగమల్లేశ్వరావు వృద్ధులకు సోమవారం అన్నసంతర్పణ జరిపించారు. హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కంచర్ల బుల్లిబాబు, సభ్యులు పద్మావతి, సురేష్, నిర్మల రాజు, వృద్ధాశ్రమ నిర్వాహకులు రిషిత, తదితరులు పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం

సత్తెనపల్లి: న్యాయవాదులకు సంబంధించిన బార్ అసోసియేషన్ 2025–26 సంవత్సరానికి సంబంధించిన ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సోమవారం ప్రారంభ మైంది. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి మాత్రమే రెండు నామినేషన్లు దాఖలయ్యాయి. తొలిరోజు ఎనిమిది పదవులకు .. తొమ్మిది నామినేషన్లు దాఖలైనట్లు ప్రధాన ఎన్నికల అధికారి గుజ్జర్లపూడి మార్కురావు, సహాయ ఎన్నికల అధికారి ఎస్. ఆంజనేయులు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి చిలుకా చంద్రశేఖర్, గంగూరి అజయ్‌కుమార్, ఉపాధ్యక్ష పదవికి సర్వేపల్లి సీతారామాంజనేయులు (సీతయ్య), సెక్రటరీ పదవికి బయ్యవరపు నరసింహారావు, సబ్‌కోర్టు సెక్రటరీ పదవికి షేక్ జానీ ఖాజావలి, జాయింట్ సెక్రెటరీ పదవికి గుజ్జర్లపూడి సురేష్, ట్రెజరర్ పదవికి బురి సైదయ్య, జూనియర్ ఎగ్జిక్యూటివ్ పదవికి తవ్వా హరినాథ్, లైబ్రేరియన్ పదవికి ఉల్లం.మధులు నామినేషన్లు దాఖలు చేశారు. మంగళవారం కూడా నామినేషన్ దాఖలు చేసేందుకు అవకాశం ఉంది.



మద్దతుదారులతో కలిసి ఆంజనేయులుకు నామినేషన్ పత్రం అందిస్తున్న న్యాయవాది చిలుకా చంద్రశేఖర్

మద్దతు ధరకు కంది, శనగల కొనుగోలు

- రైతులకు వ్యవసాయ, మార్కెటింగ్ అధికారుల భరోసా
- వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో సమావేశాలు

నాదెండ్ల: రబీలో ఈక్రాప్ వివరాలు నమోదు చేయించుకున్న రైతుల నుంచి కంది, శనగ పంటలను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు పి. మస్తానమ్మ చెప్పారు. గణపవరంలో సోమవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం కంది, శనగ పంట ఉత్పత్తులకు మార్కెట్లో లభిస్తున్న ధరలను రైతులను అడిగి తెలుసుకున్నారు. త్వరలో రెండు పంట ఉత్పత్తులను దగ్గర్లోని రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరలకు కొనుగోలు చేస్తామని చెప్పారు. జీడీసీఎంఎస్ అధికారి సీహెచ్. రవీంద్ర మాట్లాడుతూ రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుల నుంచి కంది, శనగలను నాణ్యతా ప్రమాణాల మేరకు ముందుగా శాంపిల్స్ తీసుకుంటామని తెలిపారు. ఆ తర్వాత మార్కెట్ ధరల ప్రకారం కొనుగోలు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి హరిప్రసాద్, సచివాలయ సిబ్బంది జీవన్ నాయక్, రామారావు, వెంకటేష్, లక్ష్మానాయక్, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

యడ్లపాడులో..

మార్క్‌ఫెడ్ ద్వారా శనగలను మద్దతు ధర రూ.5,650కు కొనుగోలు చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి సీహెచ్. సరిత తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకుంటే, యడ్లపాడు మార్క్‌ఫెడ్ ద్వారా కొనుగోలు చేయనున్నట్లు సూచించారు. జాలాదిలో సోమవారం అధికారులతో కలసి ఆమె శనగ పంటను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జనవరిలో సాగు చేసిన రైతుల పంటలు కోతకు సిద్ధంగా ఉండగా, నవంబర్–డిసెంబర్‌లో సాగు చేసిన రైతులు ఇప్పటికే గ్రామాల్లో అమ్మకాలు జరిపినట్టు వివరించారు. రిజిస్ట్రేషన్ చేసిన రైతుల నమూనాలను పరిశీలించి, నాణ్యమైన పంటను కొనుగోలు చేస్తామని వివరించారు. రైతులు నష్ట పోకుండా ప్రభుత్వ మద్దతు ధరకు రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం ఆర్.జె. కృష్ణ, డీసీఎంఎస్ మేనేజర్ బి. హరిగోపాల్, అరుణ్ పాల్గొన్నారు.



గణపవరంలో రైతులతో మాట్లాడుతున్న ఏడీఏ మస్తానమ్మ

వైభవంగా రెడ్డి పేరంటాలమ్మ ఆలయ పునఃప్రతిష్ట

- భారీగా తరలివచ్చిన భక్తులు
- ప్రత్యేక పూజల్లో ప్రముఖులు

నాదెండ్ల: సాతులూరులో చారిత్రాత్మక రెడ్డి పేరంటాలమ్మ ఆలయ పునఃప్రతిష్ట మహోత్సవం సోమవారం వైభవంగా నిర్వహించారు. రెండు శతాబ్దాల క్రితం నిర్మించిన ఆలయం శిథిలావస్థకు చేరడంతో గ్రామస్తులు జీర్ణోద్ధరణ పనులు చేపట్టారు. రూ.2 కోట్లతో నిర్మించిన ఆలయంలో సోమవారం ఉదయం 10.41 గంటలకు రెడ్డిపేరంటాలమ్మ తల్లి, నాగేశ్వరస్వామి, శ్రీచక్ర మహామేరువు, శిఖర కలశ ప్రతిష్ఠ నిర్వహించారు. నెమ్మికంటి నరసయ్య స్వామీజీ బృందం వేద పండితులు హత్తులూరి బాలశంకరశాస్త్రి, కల్యాణ కుమారాచార్యులు, ఆలయ ప్రధాన అర్చకులు కొండపర్తి పూర్ణాచార్యులు శాస్త్రోక్తంగా, సంప్రదాయబద్ధంగా, మేళతాళాలతో పునః ప్రతిష్ఠ నిర్వహించారు. మహాగణపతి పూజ, వాస్తు హోమం జరిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ఆలయం కిటకిటలాడింది. నరసరావుపేట, చిలకలూరిపేట పోలీసులు బందోబస్తు నిర్వహించారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భారీ అన్నదానం నిర్వహించారు.



సాతులూరు రెడ్డిపేరంటాలమ్మ తల్లి ఆలయం వద్ద అధిక సంఖ్యలో భక్తులు

ప్రత్యేక పూజల్లో ప్రముఖులు

స్వామివార్ల ప్రత్యేక పూజల్లో చిలకలూరిపేట ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు, ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ పాల్గొన్నారు. వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమాలను ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు పర్యవేక్షించారు.

ఉపాధి పథకాన్ని సద్వినియోగం చేసుకోండి

క్రోసూరు: క్రోసూరులోని దొడ్లేరు రోడ్డులో ఉన్న ఎస్టీ కాలనీలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంపై అవగాహన సదస్సు సోమవారం ఏర్పాటు చేశారు. ఏపీవో వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఈ పథకం పేద ప్రజలకు ఎంతో సహాయంగా ఉంటుందన్నారు. కౌలు రైతు సంఘం నాయకులు తిమ్మిశెట్టి హనుమంతరావు , పస్తం మల్లయ్య ఫీల్డ్ అసిస్టెంట్ పైర్ల మాణిక్యరావు, ఆవుల గంగరాజు, తిరుపతమ్మ , మల్లా సాయి , మల్లా తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు వీరాంజనేయస్వామి తిరునాళ్ల



రొంపిచర్ల: మండలంలోని వి. రెడ్డిపాలెం శివారు మర్రిచెట్టు పాలెంలో గల శ్రీ వీరాంజనేయస్వామి ఆలయ 44వ వార్షికోత్సవంతో పాటు తిరునాళ్లను బుధవారం నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకులు వినుకొండ జానకీరామాచార్యులు సోమవారం తెలిపారు. తిరునాళ్లను ఏటా ఫాల్గుణ బహుళ పంచమి నాడు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నట్లు ఆయన చెప్పారు. బుధవారం తెల్లవారుజాము నుంచే దేవాలయంలో పూజలు, పశు ప్రదక్షిణ, మధ్యాహ్నం పశు ప్రదర్శన, రాత్రి భజనలు ఉంటాయని తెలిపారు. భక్తులు పెద్దసంఖ్యలో స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని ఆయన కోరారు.

తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు

నరసరావుపేట రూరల్: జిల్లా స్థాయి తైక్వాండో పోటీల్లో శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు బంగారు పతకాలు సాధించినట్టు పాఠశాల హెచ్ఎం ఎం.పార్వతి తెలిపారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఐదో ఆహ్వాన జిల్లా తైక్వాండో చాంపియన్‌షిప్ పోటీలు తెనాలిలోని ఎన్‌టీఆర్ స్టేడియంలో ఈనెల 15న నిర్వహించారు. పాఠశాలకు చెందిన తాళ్లూరి జాన్‌పాల్ 50కేజీల విభాగంలో, గుండెపోగు దేవరాజు 44కేజీల విభాగంలో బంగారు పతకాలు సాధించినట్టు హెచ్ఎం వివరించారు. పతకాలు సాధించిన విద్యార్థులను ఆమెతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులు ఝాన్సీరాణి, షేక్ ఫాతిమా, పి.తిరుపతిరావు, కోచ్ కాంచన, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులతో హెచ్ఎం పార్వతి

ఘనంగా కుసుమ ధర్మన్న జయంతి

చిలకలూరిపేట టౌన్: జ్ఞానేశ్వరి అర్బన్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో సోమవారం ఆ సంస్థ కార్యాలయంలో తొలి దళిత కవి, స్వాతంత్ర సమరయోధుడు కుసుమ ధర్మన్న126వ జయంతిని నిర్వహించారు. సాహితీ విమర్శకులు పీవీ సుబ్బారావు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కుసుమ ధర్మన్న అనేక దళిత ఉద్ధరణ రచనలు చేశారని తెలిపారు. మాకొద్దు ఈ నల్లదొరతనం అంటూ ఆనాటి స్వదేశీయుల మీదనే తిరుగుబాటు చేసిన ధైర్యశాలి ధర్మన్న అని పేర్కొన్నారు. తరువాత తరాలవారికి స్ఫూర్తిగా నిలిచారని కొనియాడారు. తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సొసైటీ ఉపాధ్యక్షులు గేరా యాకోబు, కార్యదర్శి పానుగుబాటి బుల్లిబాబు, సభ్యులు నలమాల దానయ్య, వడ్లన చంద్రం, మాజీ ఏజీపీ దాసరి చిట్టిబాబు, డాక్టర్ దార్ల బుజ్జిబాబు, న్యాయవాది ఇనగంటి నాగరాజు, బత్తుల విక్రమ్, షేక్ బాషా, షేక్ బాజీ, గుంజి వీరాంజనేయులు, తన్నీరు వీరాంజనేయులు పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న సొసైటీ సభ్యులు

వైభవంగా శ్రీలక్ష్మీ తిరుపతమ్మ తిరునాళ్ల

శావల్యాపురం: మండలంలోని పోట్లూరు గ్రామ పంచాయతీ గంటావారిపాలెం అద్దంకి బ్రాంచ్ కెనాల్ సమీపాన గల శ్రీలక్ష్మీ తిరుపతమ్మ సమేత గోపయ్య స్వామి తిరునాళ్లను సోమవారం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు తెల్లవారుజాము నుంచి అమ్మవారిని నూతన వస్త్రాలు, పూల దండలతో అలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ గ్రామాల్లోని భక్తులు అమ్మవారిని దర్శించుకొని పొంగళ్లు పొంగించారు. పసుపుకుంకుమ, గాజులు, నూతన వస్త్రాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం దేవాలయాన్ని విద్యుత్ కాంతులతో ముస్తాబు చేశారు. మండలంలోని పోట్లూరు, కృష్ణాపురం, శావల్యాపురం గ్రామాల నుంచి భక్తులు కుంకుమబండ్లు, మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త గోనుగుంట్ల వెంకట్రావు, సభ్యులు చెరుకూరి హనుమంతరావు, సనిశెట్టి గురు వీరాంజనేయులు పాల్గొన్నారు.

ప్రతి సమస్యకూ పరిష్కారం



మాచర్ల రూరల్: ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలోనే పరిష్కరిస్తున్నట్లు తహసీల్దార్ బి.కిరణ్ కుమార్ తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో మొత్తం 8 ఫిర్యాదులందాయని, వీటిని సంబంధిత అధికారులకు నివేదించి తగు పరిష్కారించాలని ఆదేశించినట్లు ఆయన చెప్పారు. పట్టణ, గ్రామాల్లో ఎవరైనా ప్రభుత్వ భూములు, ఇతర వ్యక్తుల ఆస్తులను ఆక్రమిస్తే ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎంపీడీఓ ఫణికుమార్ నాయక్, డిప్యూటీ తహశీల్దార్‌లు బత్తుల వాణి, రమణ, ఆర్ఐ అనిల్ కుమార్, వీఆర్ఓలు పాల్గొన్నారు.